క్లుప్తంగా

పూజలు.. పరామర్శలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న కేఎల్‌ఆర్ తదితరులు

కందుకూరు: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. అన్నోజిగూడలో నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కొత్తగూడలో బొక్క వెంకట్‌రెడ్డి చిన్న కుమారుడు నాని ఇటీవల మృతి చెందగా.. వారిని పరామర్శించి సంతాపం తెలిపారు. మీర్‌ఖాన్‌పేటలో కరుణాకర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

సారా, బెల్లం పానకం ధ్వంసం



కడ్తాల్: ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా స్వాధీనం చేసుకొని, బెల్లం పానకాన్ని పారబోశామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. మండల పరిధిలోని రేఖ్య తండాలో 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 4,600 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా విక్రయిస్తున్న మంగ్లీ, సాలి, చౌలీని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. నాటు సారా తయారికి బెల్లం సరఫరా చేస్తున్న ముక్తమాధారం గ్రామానికి చెందిన బాబా పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహించినా.. అక్రమంగా మద్యం నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈఎస్ జీవన్‌కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు శ్రీనివాస్, సుభాశ్, డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ ఉన్నారు.

ఏకం కావాలి

తలకొండపల్లి: యాదవులు రాజ్యాధికార దిశలో పయనించాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సూచించారు. రాజ్యాధికారంతోనే యాదవుల జీవితాల్లో వెలుగులు వస్తాయని పేర్కొన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సదర్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. లక్ష్యాన్ని సాధించేందుకు యాదవులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, సర్పంచ్ కృష్ణమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య, యాదవ సంక్షేమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్, మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసయాదవ్, దశరథ్ నాయక్, కుమార్, ఎల్లయ్య, యాదయ్య, మల్లయ్య, దశరథం, శ్రీశైలం, పర్వతాలు, రామచంద్రయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు.

యువతిని వేధించిన యువకుడికి జైలు

హయత్‌నగర్: తనను ప్రేమించాలని యువతిని వేధించిన యువకుడికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్ కోర్టు తీర్పు ఇచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా చండూరు మండలం తెరటిపల్లికి చెందిన ఓ యువతి 2018 సంవత్సరంలో హయత్‌నగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివేది. ఆ సమయంలో హయత్‌నగర్ పద్మావతి కాలనీకి చెందిన కర్నపాటి ఉపేందర్ ఆమెను వెంబడిస్తూ తనను ప్రేమించాలని వేధించేవాడు. సెల్‌ఫోన్‌లో, వివిధ మాధ్యమాల ద్వారా మెసేజ్‌లు పంపడమే కాకుండా బస్సులో, స్నేహితుల వద్ద ఉన్నప్పుడు కూడా ఆ యువతిని వేధింపులకు గురిచేసేవాడు. ప్రేమను నిరాకరించినా ఉపేందర్ తన ప్రవర్తనను మానుకోలేదు. దీంతో బాధితురాలు 2018 మార్చిలో హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించారు. సాక్ష్యాదారాలు పరిశీలించిన కోర్టు నిందితుడికి ఆరు నెలల జైలు, రూ.20 వేల జరిమానా విధించారు.

తండ్రి కోసం తనయ ఆరాటం

ఇబ్రహీంపట్నం రూరల్: మంచికి మారుపేరైన బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలిపించాలని ఆయన కుమార్తె సీతల్, కోడలు మౌనిక ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. శుక్రవారం మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్వగ్రామంలో ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టుపెట్టి ఓట్లు అభ్యర్థించారు.

కాంగ్రెస్ వస్తే అరాచకమే

మంచాల: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అరాచకమే అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్, ఎంపీపీ నర్మద అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు.

ఆడబిడ్డను.. ఆశీర్వదించండి

సేవకురాలిగా పనిచేస్తా

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కష్టాలు తప్పవు
- ఎవరేం చేసినా బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరు
- విద్యాశాఖ మంత్రి ఎమ్మెల్యే అభ్యర్థి సబితారెడ్డి
- పార్టీ శ్రేణులు, అభిమానులతో ర్యాలీగా నామినేషన్ సమర్పణ



మీర్‌పేట: నామినేషన్ దాఖలుకు ర్యాలీగా వెళ్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: ఆడబిడ్డనైన తనను మరోసారి ఆశీర్వదించాలని విద్యాశాఖ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పటోళ్ల సబితారెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం కర్మాన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు చేసిన అనంతరం భారీ ర్యాలీగా వెళ్లి మహేశ్వరం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. మహేశ్వరంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. రియల్ లీడర్‌తో పోటీ పడుతున్నారన్నారని చెప్పారు. ఐదేళ్లుగా ఎక్కడా కనిపించని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్నికలు రాగానే.. ఓట్ల కోసం వస్తున్నారని ఎద్దేవాచేశారు. పటోళ్ల, తీగల కుటుంబాలు ఒక్కటయ్యాయని.. ఇక మహేశ్వరం గడ్డపై బీఆర్‌ఎస్‌కు తిరుగులేదని ధీమా వ్యక్తంచేశారు.

ఆరు నూరైనా విజయం తథ్యం..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఆరు నూరైనా మూడోసారి గులాబీ సర్కార్ కొలువుదీరుతుందని స్పష్టంచేశారు. ర్యాలీ సందర్భంగా మహేశ్వరం గేటు నుంచి మండల కేంద్రం వరకు జనసంద్రంగా మారింది. సబిత గెలుపును కాంక్షిస్తూ గులాబీ శ్రేణులు కదం తొక్కారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, యెగ్గె మల్లేశం, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్‌లాల్, నాయకులు చంద్రయ్య, రాజు నాయక్, కూన యాదయ్య, మల్లేశ్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి, అంబయ్య, రాఘవేందర్‌రెడ్డి, అంజయ్య ముదిరాజ్, లక్ష్మయ్య, సురేష్ పాల్గొన్నారు.

మంత్రికి మద్దతుగా..

కందుకూరు: బీఆర్‌ఎస్ మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం మండల పరిధి నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచి బైక్‌లతో ర్యాలీగా మహేశ్వరానికి వెళ్లారు.

జల్‌పల్లి నుంచి..

పహాడీషరీఫ్: మంత్రి సబితా రెడ్డి నామినేషన్‌కు బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, యంజాల జనార్దన్, అర్జున్, దూడల సుధాకర్ గౌడ్, సయ్యద్ యూసుఫ్ పటేల్, కైసర్ బామ్‌లు వెయ్యి బైక్‌లతో ర్యాలీగా బయల్దేరారు.

నామినేషన్‌కు తరలిన సబితారెడ్డి

మీర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ అసెంబ్లీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి శుక్రవారం కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నడుమ నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లారు. ఈ ర్యాలీలో మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఉన్నారు.



కందుకూరు: ర్యాలీగా వెళ్తున్న గులాబీ శ్రేణులు

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మంత్రి సబితారెడ్డి నామినేషన్‌కు మున్సిపాలిటీ పరిధి నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వెళ్లారు.

'హస్తం'తోనే తెలంగాణ అభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్‌ఆర్

తుక్కుగూడ: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్‌ఆర్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలన అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు ఖాయమని, పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రచారం చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, స్పజన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు చిగిరింత నర్సింహ్మారెడ్డి, జానకీరామ్, ఏనుగు జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే అందరికీ మేలు

హుడాకాంప్లెక్స్: పేదల పార్టీ కాంగ్రెస్ అని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే అందరికీ మేలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయన మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతుగా సరూర్‌నగర్ డివిజన్ పరిధి డాక్టర్స్, లక్ష్మీనగర్ కాలనీల్లో పర్యటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు అవుతాయని, చేతి గుర్తుకు ఓటు వేసి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, రాముగౌడ్, రవీంద్ర, ఇమ్రాన్‌అలీ, సంతోష్, నిర్మలారెడ్డి, అరుణ, రవళి, సుశీల పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న భాస్కర్‌రెడ్డి తదితరులు

అనాథ విద్యార్థి గృహానికి రూ.25 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: మన్సూరాబాద్ విజయ శ్రీకాలనీ అధ్యక్షుడు జొన్నాడ మోహన్ రెడ్డి, మీనా దంపతులు శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి రూ.25 వేల చెక్కును విరాళంగా అందజేశారు. తన తండ్రి దివంగత నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ విరాళం అందజేసినట్టు మోహన్ రెడ్డి తెలిపారు. తాము ఇచ్చిన విరాళంతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ కొనుగోలు చేయాలని గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌ను కోరారు.

లెక్క మించితే చేటే..!

- ఎన్నికల ఖర్చుల వివరాలు పక్కాగా ఉండాలి
- అదుపు తప్పితే తిప్పలే
- ఒక్కో అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు పెట్టొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్: జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. అభ్యర్థులు ఎన్నికల్లో రోజువారీగా చేసే ఖర్చులకు లెక్క పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అభ్యర్థులు ప్రతిరోజు చేసిన ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘానికి అందించాల్సి ఉంటుంది. అభ్యర్థి రూ. 40 లక్షలకు మించి ఖర్చు చేయరాదని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఒకవేళ ఎక్కువ ఖర్చు చేస్తే ఎన్నికల సంఘం వేటు వేసే అవకాశం లేకపోలేదు. దీంతో ఎన్నికల్లో రోజువారీగా చేసే ఖర్చులకు సంబంధించిన వివరాలపై ఎన్నికల పరిశీలకులు అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోసం అభ్యర్థులు చేసే ఖర్చుల వివరాలను రోజువారీగా లెక్క చెప్పాల్సి ఉంటుంది. పట్టణం, గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారం కోసం అవసరమైన ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘం ఇప్పటికే విడుదుల చేసింది.

నిరంతర నిఘా

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ. సీపీఎం, బీఎస్పీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. అభ్యర్థులు చేసే ఖర్చులకు సంబంధించిన వాటిపై వ్యయ పరిశీలకులు నిరంతరం నిఘా పెడుతున్నారు. రోజువారీగా అభ్యర్థులకు షాడోగా ఉంటూ ఖర్చులకు సంబంధించిన వివరాలను సేకరిస్తారు. అభ్యర్థులు ప్రచారంలో చేసిన ఖర్చుల వివరాలను రెండు రోజులకొక్కసారి ఎన్నికల అధికారులకు అందించాల్సి ఉంటుంది. లేకుంటే అధికారులు అభ్యర్థులకు నోటీసులు జారీ చేస్తారు.

కల్వకుర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

బీజేపీ అభ్యర్థి ఆచారి

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి స్పష్టం చేశారు. శుక్రవారం కల్వకుర్తిలో నామినేషన్ దాఖలు చేసేందుకు నిర్వహించిన బైక్ ర్యాలీని ఆచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశానని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ఆ పార్టీకి ఓటమి తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న ఆచారి

కల్వకుర్తికి తరలిన బీజేపీ నాయకులు

కడ్తాల్: కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు, మండల కేంద్రం నుండి పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు శుక్రవారం బైక్‌లపై బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి, ఆచారిని గెలిపించాలని నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, మహేశ్, మాన్యనాయక్, శంకర్‌నాయక్, సాయిలాల్‌నాయక్, భగీరథ్, సాయిప్రభు, డాక్టర్ రమేశ్ ఉన్నారు.

'ఇందిరమ్మ' రాజ్యంతోనే పేదల సంక్షేమం



గుర్రం కేశవులు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం కోసం అందరూ కృషి చేయాలని ఆమనగల్లు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లి తాండాలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తాండాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గుర్రం కేశవులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుర్రం కేశవులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, మాజీ వార్డు సభ్యులు మల్లేశ్‌నాయక్, నాయకులు శ్రీధర్ నాయక్, రాజ్యానాయక్, రాజు, హర్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడిస్తాం

మంచాల: అధికార దాహంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్దన్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుడమోని జయమ్మ మండిపడ్డారు. శుక్రవారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఓడిపోతామని భయంతో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు చేసి భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామ్ రెడ్డి, మండల కన్వీనర్ నరేందర్ రెడ్డి, నాయకులు హనుమంత్ రెడ్డి, మల్లేశ్, వీరేశ్‌గౌడ్, వెంకటేశ్, రాందాస్ సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేక దాడులు

యాచారం: ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి నామినేషన్ ర్యాలీకి వచ్చిన ప్రజాబలాన్ని చూసి, ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు దాడికి పాల్పడ్డారని యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనువాస్‌రెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమి భయంతో కాంగ్రెస్ శ్రేణులపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సమావేశంలో నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, అమృతాసాగర్, శ్రీనువాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. నారాయణరెడ్డి గెలుపునకు కృషి చేస్తానని సుధాకర్ రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి అంజయ్యగుప్తా, చిత్తరంజన్తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

కడ్తాల్: మైసిగండి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని, కారుగుర్తుకు ఓటేయాలని కోరారు.

ప్రలోభాలు... విందు రాజకీయాలు!



ఎల్‌బీనగర్: ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ప్రలోభాలతో విందు రాజకీయం మొదలైంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే పలు కాలనీలో రోజు వారీగా రాత్రి వేళలో మందు పార్టీలతో ఓటర్లను ప్రలోభపర్చుకునే పనిలో పడ్డారు. పార్టీ అభ్యర్థులు విజయానికి దోహదపడే ఏ ఒక్క అంశాన్ని కూడా వదులుకోవడంలేదు. ప్రతి రోజూ కాలనీలో ఇంటింటి ప్రచారంతో ర్యాలీలు, చేరికలు, సమావేశాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కాలనీలో ఓట్లు దండుకునేందుకు పసందైన దావత్‌లతో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులతో మాట్లాడి కాలనీ నాయకులు అందరూ హాజరయ్యేలా చూస్తున్నారు. దావత్ సమయంలో అభ్యర్థులు వచ్చి తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారాని హామీలు..

ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు కాలనీలో నెలకొన్న సమస్యలపై ప్రజలకు హామీలు గుప్పిస్తున్నారు. తాను విజయం సాధించిన వెంటనే మీ సమస్యలను పరిష్కరిస్తానని, అందరూ తన విజయానికి సహకరించాలని కోరుతున్నారు. కొందరు స్థానిక రాజకీయాలతో తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తారు. అలాంటి వారిని తమవైపు తిప్పుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్స్ సైతం..

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అపార్ట్‌మెంట్లు అధికంగా ఉన్నాయి. కొందరు తమ అపార్ట్‌మెంట్లలో నిర్వహించే సమావేశాలకు అభ్యర్థులను ఆహ్వానించి తమ అపార్ట్‌మెంట్లకు రంగులు వేయాలని కోరుతున్నట్టు తెలుస్తోంది. మరికొన్ని కాలనీల్లో సంక్షేమ భవనాలు, మినీ ఫంక్షన్ హాళ్లు, పార్కులు కావాలని కోరుతున్నారు. ఓట్లను దండుకునే ప్రయత్నంలో అభ్యర్థులు కాలనీవాసులు ఏది అడిగితే దానికి సై అంటూ హామీ ఇస్తున్నారు. లక్షల ఖర్చు అయినా లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

- కేసీఆర్ సర్కార్‌ను సాగనంపండి
- వచ్చేది మా ప్రభుత్వమే
- ప్రజల ఆంకాక్షలను నెరవేరుస్తాం
- కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి జోస్యం చెప్పారు. మరో 20 రోజుల్లో నియంత పాలన పోయి కాంగ్రెస్ ప్రజాపాలన వస్తుందని స్పష్టం చేశారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంత, అరాచక, అవినీతి పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మాయమాటలు చెప్పే కేసీఆర్ సర్కార్‌ను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం జరుగుతుందని ప్రకటించారు. ఆరు గ్యారంటీ పథకాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని, పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నారాయణరెడ్డి కోరారు. ర్యాలీలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఆమనగల్లు పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ అనిత, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, మాజీ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వస్పుల జంగయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, నాయకులు రాములు, అప్పం శ్రీను, కాలె మల్లయ్య, బాబా, కాసోజు రాము, కృష్ణనాయక్, సురేశ్‌నాయక్, రాఘవేందర్, నాజర్ పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారాయణరెడ్డి, నాయకులు

మైసమ్మ ఆలయంలో పూజలు

కడ్తాల్: కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబసభ్యులు, పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఉదయం మైసిగండి మైసమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణరెడ్డిని ఆశీర్వదించి, శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కసిరెడ్డి నారాయణరెడ్డి నామినేషన్ వేసేందుకు కల్వకుర్తికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ తదితరులు ఉన్నారు.

నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు భారీగా ర్యాలీగా కల్వకుర్తికి వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డేవిడ్, శంకర్‌నాయక్, అంజయ్యగుప్తా పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నారాయణరెడ్డి

అభివృద్ధిని చూసి.. ఆదరించండి

ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట/ఎల్‌బీనగర్/చైతన్యపురి: బీఆర్‌ఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం చైతన్యపురి డివిజన్‌లోని మున్సిపల్ కాలనీ, ఇంద్రానగర్ తదితర కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి కారు గుర్తుపై ఓటువేసి తనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఆయా కాలనీవాసులు సుధీర్‌రెడ్డికి డప్పు చప్పుళ్లతో పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి నుదుటున తిలకం దిద్ది ఆశీర్వదించారు. కొన్ని కాలనీల్లో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, కుల సంఘ నేతలు ఆయనను కలిసి తామంతా కారు గుర్తుకే ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో ఉన్న 90 శాతం దీర్ఘకాలిక సమస్యలకు వేల కోట్ల ప్రత్యేక నిధులతో శాశ్వతంగా పరిష్కరించామన్నారు. మిగిలిన కొద్దిపాటి పనులు ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామన్నారు. ఎల్‌బీనగర్‌లోని కాలనీల ఉనికి కూడా తెలియని కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నాడని, ఈ నియోజకవర్గాన్ని ఆయన ఏ విధంగా అభివృద్ధి చేస్తాడో కాలనీవాసులే అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డికి ఓటు అడిగే నైతిక హక్కు కూడా లేదని సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్‌లో తాను చేసిన అభివృద్ధే తన ఘనవిజయానికి దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.